బి. శ్రీవల్లీ రాధిక

చదువు

బస్ కదలగానే సీట్‌లో వెనక్కి వాలి కూర్చున్నాను. ఇప్పుడు వెళ్ళబోతున్న వూర్లోనే పుట్టాను నేను యిరవై ఏళ్ళ క్రిందట.

నా చిన్నప్పుడు చాలాసార్లు యిక్కడికి వచ్చాను కూడా.

ఈ ఊరు.., అందులోని పెద్ద ఇల్లూ, తోటలూ, ఆ తోటల్లో పడి మేము ఆడుకున్న ఆటలూ.. పదేళ్ళ క్రిందటి ఆ అనుభూతుల్లో ప్రతి చిన్న విషయమూ గుర్తుంది నాకు.

ఒళ్ళు పులకరింపచేసే అమ్మమ్మ ప్రేమ, నోరూరించే సీతాఫలాలు, చెరకుగడలు...

తాతయ్య కోపం కూడా. నిజం చెప్పాలంటే మిగిలిన వాటన్నిటికంటే అదే బాగా గుర్తుంది. అసలు తాతయ్య కోపం తల్చుకుంటే యిప్పటికి కూడా వణుకొస్తుంది నాకు. బాగా చిన్నతనంలో నైతే "తాతయ్యకి కోపం వస్తుంది" అంటూ నన్ను ఎవరైనా భయపెడితే నేను ఆశ్చర్యపోయేదాన్ని, "నాతో యింత ప్రేమగా కబుర్లు చెప్పే తాతయ్యకి కోపం వస్తుందా!" అని.

కానీ ఆ తరువాత్తరువాత తెలిసింది నాకు తాతయ్య కోపం ఎంత భయంకరంగా వుంటుందో!

అప్పట్లోనే ఒకరోజు, మేమందరం త్వరగా అన్నాలు తినేసి ముందుగదిలో ఆడుకుంటున్నాం. పెద్దవాళ్ళంతా ఓ గదిలో కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు.

అమ్మమ్మ ఏమో తాతయ్యకి అన్నం పెడుతూంది వెనకవైపు వరండాలో . అప్పుడు ఒక్కసారిగా వినబడిన పెద్ద శబ్దానికి అందరం వులిక్కిపడి వెనకవైపుకి పరుగెత్తాం.

మేం వెళ్ళేసరికి, అక్కడ ... తాతయ్య విసిరి కొట్టిన కంచం వరండా అంతా

భూచక్రంలా గిర్రున తిరుగుతోంది. అది విరజిమ్ముతూన్న అన్నం వరండా దాటి వంటగది వరకూ చిందరవందరగా పడుతోంది.
మంచినీళ్ళ గ్లాసు అరటిచెట్టు మొదట్లోకి వేగంగా పయనించే ముందు అమ్మమ్మ చేతిని ఓసారి పరామర్శించింది కాబోలు, అమ్మమ్మ మీద అంతా నీళ్ళు చిమ్మినట్లు పడి వున్నాయి.
తాతయ్య తాపీగా వెళ్ళి, బావి దగ్గర చేయి కడుక్కున్నాడు. ఆ తర్వాత వెళ్ళిపోయి అప్పటికే అమ్మమ్మ వేసి వుంచిన పక్క మీద పడుకున్నాడు.
కాసేపటివరకూ ఎవరూ ఒక్కమాట కూడా మాట్లాడేందుకు సాహసించలేదు.
ఆ తర్వాత మొదలయిన గుసగుసల్లో అర్థమయింది, తాతయ్యకి అన్నంలో వెంట్రుక వచ్చిందనీ.., ఒక్కసారి వస్తే అమ్మమ్మ తీసేసిందనీ.., రెండోసారి రాగానే కంచం విసిరికొట్టి వెళ్ళిపోయాడనీ..
బహుశా అపుడే అనుకుంటా చివరిసారి నేనీ వూరు రావడం. మళ్ళీ యిన్నేళ్ళ తర్వాత .. యిపుడు.
నేను ఆలోచనల్లో వుండగానే బస్ ఆగింది. ఒకే ఒక్క క్షణం ఆగిన బస్‌లో నుండి వంటరిగా దిగిన నేను, ప్రశాంతంగా వున్న ఆ పచ్చని ప్రకృతిని పరవశంగా చూస్తూండిపోయానో నిమిషం.
తర్వాత రోడ్డుకవతలగా కనిపిస్తున్న జట్కాబండి వైపు అడుగులు వేశాను.
పచ్చని ప్రకృతి మధ్యగా పరుగులు పెడుతున్న బండిలో కుదుపులకి అడ్జస్ట్ అవడానికి నాకు కాస్త టైం పట్టింది.
ఈ పల్లెటూర్లో, ఈ మట్టిరోడ్ల మీద జట్కాబండిలో ఒంటరిగా నేను ప్రయాణించడం.. "కల కాదు కదా!" అనిపిస్తోంది.
ఇంత దూరం యిలా వంటరిగా ప్రయాణించడం నాకిదే మొదటిసారి.
పైగా యిన్నేళ్ళ తర్వాత వెళ్తుంటే, ఎంత అమ్మమ్మ వాళ్ళ యిల్లయినా కొంచెం బెరుకుగానే వుంది.

నిజానికి అమ్మమ్మనీ, తాతయ్యని నేను చూడటం కంటే అమ్మ మాటల్లో విన్నదే ఎక్కువ.

తాతయ్య కోపంతో అమ్మమ్మ ఎన్ని అవస్థలు పడిందో కథలుగా చెప్తూంటుంది అమ్మ. ఎన్నెన్ని కథలో! ఎన్నెన్ని కష్టాలో!

అమ్మ చెప్తుంటే బాధ వేసేది. "ప్రతిరోజూ ప్రళయంగా ఎలా గడిపిందో అమ్మమ్మ యిన్ని సంవత్సరాలని!" అనిపిస్తుంది నాకు.

ఏం చేస్తుంది భరించక! బయటకి వెళ్తే ఆదరించడానికి తనకి ఎవరూ లేరు. కనీసం చదువైనా లేదు. అయినా పల్లెటూర్లో పుట్టి, లోకజ్ఞానం లేకుండా పెరిగిన అమ్మమ్మకి అంత తెగింపు, ఆత్మవిశ్వాసం ఎలా వస్తాయ్!

ఇదివరకే అలా వుండేదంటే యిపుడు అమ్మమ్మకి చూపు కూడా బాగా తగ్గిపోయిందట. వయసూ పెరిగిపోయింది. ఇపుడు మరింకెంత అవస్థ పడుతూందో!

తల వంచుకుని బాధగా ఆలోచిస్తున్న నేను "అదిగోనండీ అదే నాగభూషణం గారి యిల్లు" అన్న బండివాడి మాటలకి తల ఎత్తి చూశాను.

దూరంగా కనిపించింది యిల్లు. తాతగారు వరండాలోనే కూర్చుని వున్నారు. నిజంగా తాతగారేనా! ఎంత మారిపోయారు! సన్నగా, శరీరమంతా ముడుతలతో, కుర్చీలో ముడుచుకుని కూర్చున్న తాతయ్యని చూడగానే మనసు ఒక్కసారి వులిక్కిపడి ఆప్యాయతని ఫౌంటెన్‌లా చిమ్మినట్లయింది.

ఈ లోపల బండివాడు సూట్‌కేస్ లోపలికి తీసుకు వెళ్తూ "మామ్మగారూ! ఎవరొచ్చారో చూడండీ!" అని అరిచాడు.

"ఎవరదీ!" అంటూ మెల్లగా లేచాడు తాతయ్య. దొడ్లో బట్టలు ఆరేసుకుంటున్న అమ్మమ్మ కూడా "ఎవరూ! వీరయ్యా!" అంటూ, గోడ పట్టుకుని నడుస్తూ వచ్చింది, కళ్ళు చిట్లించి చూస్తూ.

బండి దిగి, వాళ్ళిద్దరినీ చూస్తూ ఒక్క క్షణం అలా

నిలబడిపోయిన నేను, గబగబా నాలుగడుగులు వేసి, ఆవిడ చేయి పట్టుకుంటూ "నేను అమ్మమ్మా! మాధవిని" అనబోయాను.
ఈలోపల తాతయ్యే, ఎలా గుర్తు పట్టాడో కానీ, "మాధవే, మన మాధవి వచ్చింది." అన్నాడు ఆనందంగా.
ఆవిడ నా భుజాల మీద చేయి వేస్తూ "నువ్వటే! ఇదేవిటీ! ఎప్పుడొచ్చావ్! ఒక్కదానివే వచ్చావా!" అంది ఆశ్చర్యంగా, ఆప్యాయంగా.
బ్యాగ్‌లో నుంచి డబ్బులు తీసి, వీరయ్యకి యిచ్చి, "చెప్తా. చెప్తా." అంటూ లోపలికి నడిచాను నేను.

*****

ప్రయాణం బడలిక తీరేలా హాయిగా స్నానం చేశాక, ముందు ఒక్కసారి పెరడంతా తిరిగి ఏమేం మొక్కలున్నాయో, ఏవి పూలు పూస్తున్నాయో చూసి వచ్చాను.
దొడ్లో గోరింటాకు చెట్టు, వాకిట్లో పారిజాతం పూల చెట్టూ, ఉత్తరం వైపు పచ్చ కనకాంబరాల చెట్టూ.. అన్నీ ఎక్కడివక్కడే అలాగే వున్నాయి, చెక్కు చెదరకుండా. కాకపోతే ఒంటరిగా, దిగులు దిగులుగా.. అచ్చు అమ్మమ్మ, తాతయ్యల్లా వున్నాయి.
అన్ని మొక్కల్నీ ఒకసారి చూశాక మెల్లగా వచ్చి అమ్మమ్మ దగ్గర కూర్చున్నాను. అమ్మమ్మ నన్ను చూడగానే మళ్ళీ కుంపట్లో కాసిని బొగ్గులు వేసి వంట మొదలుపెట్టింది. కుంపటిలో నిప్పుల్ని చేత్తోనే అటూ యిటూ కదిలిస్తున్న అమ్మమ్మని చిన్నప్పుడు చూసినట్లే అబ్బురంగా చూశాను నేను.
తాతయ్య కూడా వచ్చి మా దగ్గరే కూర్చున్నాడు, బాసింపట్టు వేసుకుని. అమ్మమ్మ వంట ముగించి పెరట్లోని అరిటాకులు రెండు తీసుకు వచ్చి

వడ్డించసాగింది.

అమ్మమ్మని చూస్తుంటే అసలు ఏమాత్రం కనిపించడం లేదని అర్ధమవుతూనే వుంది. కానీ ఎన్నో సంవత్సరాలుగా అలవాటయిన పరిసరాలు కాబట్టి అన్ని పనులూ చేసుకోగలుగుతోంది.

"ఇంకెక్కడికైనా వెళ్తే అసలెందుకూ పనికి రాను" అంది తనే.

సరిగా కనబడకపోయినా అలాగే తడుముకుంటూ, కొసరి కొసరి వడ్డిస్తున్న అమ్మమ్మ ఆప్యాయతతో అన్నం అమృతంలా వుందేమో, నేను తాపీగా, సుష్టుగా తినే ప్రయత్నం చేస్తున్నాను.

తాతయ్య మాత్రం రెండు ముద్దలు చప్పరించి "మజ్జిగ పోయవే" అన్నాడు.

అమ్మమ్మ మెల్లగా వెళ్ళి మజ్జిగ గిన్నె తెచ్చింది. అటే చూస్తున్న నాకు షాక్ తగిలినట్లయింది.

నా గొంతులో అన్నం, చేతిలో ముద్ద, ఎక్కడివక్కడే ఆగిపోయాయి. మరో చేతిలో వున్న గ్లాసులోని నీళ్ళు వణికి తొణికాయి.

కారణం. విస్తట్లో పోయాల్సిన మజ్జిగని అమ్మమ్మ అతిపదిలంగా తాతయ్య తల మీద పోసింది.

అవి నున్నగా వున్న తాతయ్య గుండుపై పడి, అక్కడినుండి పాయలుగా చీలి, ముక్కు మీదగా, భుజాల మీదగా, ముంజేతుల మీదగా క్రిందికి జారుతున్నాయి గంగా ప్రవాహంలా.

ఇంత పెద్ద వయసులో అమ్మమ్మ అపరాధిలా శిక్షింపబడుతుందేమోనన్న ఆలోచన నన్ను స్థాణువును చేసింది.

నేనలా చేష్టలుడిగి చూస్తూండగానే తాతయ్య "ఏయ్ ఏయ్ ఏమిటే యిది!" అంటూ అరిచాడు.

ఈలోపల అమ్మమ్మకీ అనుమానం వచ్చిందో, లేకపోతే పోసిన మజ్జిగ చాలనుకుందో కానీ గిన్నె వంచడం ఆపి నిల్చుంది.

తాతయ్య అమ్మమ్మ చేతిలోని గిన్నె లాక్కుని, తనే కాసిని మజ్జిగ పోసుకుని, గిన్నె మళ్ళీ అమ్మమ్మ చేతికి అందించాడు.

"ఏమిటండీ! ఏమైందీ!" అంది అమ్మమ్మ అయోమయంగా. తాతయ్య మాట్లాడకుండా విస్తట్లోని రెండు ముద్దలూ తినేసి లేచాడు.

నేను చెప్పాను మెల్లగా "నువు మజ్జిగ తాతయ్య తలమీద ఒంపేశావు అమ్మమ్మా!" అని. అమ్మమ్మ నివ్వెరబోయింది. "అయ్యయ్యో! అంటూ బావి దగ్గరకి వెళ్ళింది కంగారుగా, తాతయ్యకి నీళ్ళందించేందుకు.

నేను మాత్రం చాలా సేపటివరకూ ఆశ్చర్యంలో నుంచి తేరుకోలేదు. తేరుకున్న తర్వాత అనుకున్నాను "తాతయ్యకి కొద్దిగా కోపం తగ్గినట్లుంది అని. తాతయ్య వెళ్ళి పడుకున్నాక అమ్మమ్మతో అన్నాను నేను "మరి యింత యిబ్బందిగా వున్నపుడు, యిక్కడ వంటరిగా ఎందుకు వుంటారు అమ్మమ్మా! మామయ్య వాళ్ళ దగ్గరికి వెళ్ళిపోవచ్చు కదా! తాతయ్య ఒప్పుకోడా!" అని.

"నేను చేసుకోలేక పోతున్నానని మీ తాతయ్య వెళ్దామనే అంటున్నారు. కానీ అక్కడికి వెళ్తే మీ తాతయ్య దిగులు పడతారు. అక్కడ ఆయనతో మాట్లాడేవాళ్ళెవరుంటారు!" అంది అమ్మమ్మ.

నేను కన్నార్పకుండా చూస్తూండిపోయాను. ఎందుకో యిదివరకులా "ఏమిటీ చాదస్తం!" అనిపించలేదు.

సాయంత్రం అవగానే "ఈ ప్రక్కనే ఒకళ్ళు పేరంటం పిలిచి వెళ్ళారు. వెళ్దామా!" అని అడిగింది అమ్మమ్మ.

నేను హుషారుగా బయల్దేరి వెళ్ళాను గానీ "ఏం పేరంటం" అని అడగలేదు. తీరా అక్కడికి వెళ్ళాక తెలిసింది, వాళ్ళ అమ్మాయి పెద్దదయిందట. అందుకు.. పేరంటం.

నేను యిలాంటివి ఎపుడూ చూడలేదు. విన్నానంతే. "అలా అందరినీ

కూర్చోపెట్టి పేరంటం చేస్తే ఆ అమ్మాయికి సిగ్గుగా వుండదూ పాపం!" అనుకునేదాన్ని యిదివరకు. కానీ ఈరోజు ఆ అభిప్రాయం మారిపోయింది. అలా సిగ్గుపడే పరిస్థితులేం లేవు యిక్కడ.

అయినా నోరూరుకోక అడిగాను "అమ్మమ్మా! ఇలా పేరంటం చేయడం వల్ల ఏమైనా వుపయోగం వుంటుందా! ఐ మీన్, దీనివల్ల జరిగే మంచి ఏముంటుంది చెప్పు!" అని.

అమ్మమ్మ నవ్వింది. "మంచో, చెడో మాకేం తెలుస్తుందే! ఈ పల్లెటూర్లో పుట్టాం. చదువూ, సంధ్యా లేకుండా పెరిగాం. పెద్దవాళ్ళు చెప్పినదాన్ని గుడ్డిగా ఆచరించడమే గానీ మీలాగా మేము ఎప్పుడూ ఆలోచించం" అంది. నేను అవాక్కయి చూస్తుంటే మళ్ళీ తనే అడిగింది "అయితే ఏం! మేము ఆనందంగా లేమూ!" అని.

నేను సమాధానం చెప్పలేదు. నా చదువును చూసి నేను గర్వపడినట్లే, తన చదువును చూసి తాను గర్వపడుతోంది అమ్మమ్మ.

పేరంటంలో అమ్మమ్మ పాటలు పాడింది. అమ్మమ్మ అంత బాగా పాడుతుందని నాకు తెలీదు. ప్రతి పేరంటానికీ ప్రత్యేకంగా పాటలుంటాయని కూడా నాకప్పుడే తెలిసింది.

ఇంటికి వచ్చాక "అమ్మమ్మా! ఇందాక పాడిన పాటలు పాడతావా! నేను రికార్డ్ చేసుకుంటాను" అని అడిగాను.

అమ్మమ్మ మొదట సిగ్గుపడింది. నేను బ్రతిమలాడడంతో "సరే. మీ తాతయ్యని పడుకోనీ" అంది.

తాతయ్య పడుకున్నాక, అమ్మమ్మా నేనూ దొంగల్లాగా మెల్లగా వాకిట్లోకి చేరాం. ఆ చల్లని వెన్నెలలో, పారిజాతాల సువాసన పీలుస్తూ, అమ్మమ్మ పాటలు వింటుంటే కలిగిన తన్మయత్వం.. బహుశా అది నా జీవితంలోకెల్లా అద్భుతమయిన అనుభూతి కావచ్చు.

మొత్తానికి తాతయ్యకి మెలకువ రాకుండా పని పూర్తి చేసుకున్నందుకు ఆనందిస్తూ, అమ్మమ్మని తీసుకుని లోపలికి వెళ్ళబోయిన నేను...

అక్కడ వరండాలో, చీకట్లో కూర్చున్న తాతయ్యని చూసి అసంకల్పితంగా పెద్ద కేక పెట్టాను. తాతయ్య మాత్రం మెల్లగా కుర్చీలో నుంచి లేస్తూ, "నేనేనే. పాటలు విందామని కూర్చున్నా. మీ అమ్మమ్మ యింత బాగా పాడుతుందని నాకింతవరకూ తెలీనే తెలీదు" అన్నాడు.

తాతయ్య గొంతులో వినబడిన సంబరానికి నేను విస్తుపోయాను. నేను ఊహించినదేమిటి! చూస్తున్నదేమిటి! తాతయ్యలోని మార్పుకు కారణం.. అవసరమా! ఇంకెన్నాళ్ళో బ్రతకను అన్న భయమా!

ఏమో! ఏదీ తర్కానికి నిలబడడం లేదు.

ఆలోచనలతోనే రాత్రంతా గడిపేసిన నాకు తెల్లవారుఘామున ఎపుడో కొద్దిగా నిద్ర పట్టింది. అంతలోనే అలికిడికి మెలకువ వచ్చేసింది.

వచ్చేటపుడు "ఒక్కరోజు వుండి వెళ్దాం" అనుకుంటూ వచ్చాను. కానీ, యిపుడు అసలు వెళ్ళాలనిపించడం లేదు. కానీ ఎలా! ఫ్రెండ్ పెళ్ళికి అని వచ్చి, యిక్కడ కూర్చుండిపోతే ఎలా!

ఒక రెండ్రోజులు ముందు వచ్చి వుంటే ఎంత బాగుండేది! "ఆ పల్లెటూర్లో ఏం తోస్తుంది!" అనుకున్నాను అప్పుడు పిచ్చి మొహంలా.

ఆలోచిస్తూ పెరట్లో కూర్చున్న నన్ను చూసి "ఇంక లేచి స్నానం చేయి. బస్ టైం అవుతోంది" అంది అమ్మమ్మ. నేను లేచి నిలబడ్డాను. వాళ్ళ ఒంటరితనం చూస్తుంటే నాకు చాలా దిగులు వేస్తోంది. కానీ చేసేదేముంది! చిన్నగా నిట్టూర్చి బాత్‌రూంలోకి వెళ్ళాను.

నేనలా వెళ్ళానో, లేదో.. బయటనుంచి పెద్ద శబ్దం, అమ్మమ్మ బాధగా అరిచిన అరుపు వినిపించాయి.

అమ్మమ్మ గదిలో వున్న మంచం ఇవతలికి తేబోయినట్లుంది.

తాను క్రింద పడి, మంచం తన మీద పడేసుకుంది. తాతయ్య వచ్చి మెల్లగా లేపి లోపలికి తీసుకువెళ్తున్నాడు.

నేను గబగబా స్నానం ముగించి, ఆయింట్‌మెంట్ తీసుకుని వెళ్ళేసరికి తాతయ్య అమృతాంజనం తేవడం, దాన్ని అమ్మమ్మ కాలికి పూసి రిపేర్ చేయడం అయిపోయింది.

"పదండి. మీకు కాస్త హార్లిక్స్ యిస్తాను" అంటోంది అమ్మమ్మ.

"నువు కాసేపు కూర్చోవే" అంటున్నాడు తాతయ్య.

నేను పెదవులపై నవ్వు, కళ్ళల్లో నీరు మెరుస్తూండగా యివతలికి వచ్చేశాను. నాకు అర్థమయింది. వాళ్ళకి యిపుడు ఎవరి అవసరమూ లేదు. వాళ్ళ లోకం వాళ్ళది. వాళ్ళ జీవితం వాళ్ళది.

అది తెలిశాక నేను చకచకా రెడీ అయిపోయాను. వీరయ్య బండి వచ్చి ఆగింది వాకిట్లో. అది కదిలేవరకూ జాగ్రత్తలు చెప్తూనే వున్నారు యిద్దరూ.

తండ్రి మాట కోసం అడవులకి వెళ్ళిన రాముడి గురించీ, సత్యం మాట్లాడటం కోసం కష్టాలు పడిన హరిశ్చంద్రుడి గురించీ చిన్నప్పుడు చదువుకున్నాను నేను. కానీ మంచో, చెడో ఒక సిద్ధాంతాన్ని గుడ్డిగా నమ్మడం అనేది మనిషికి ఎంత శక్తినిస్తుందో, అందులో గెలుపు మరింకెంత అద్భుతంగా వుంటుందో.. నాకిప్పుడే అర్థమయింది.

"తెలివితేటలు లేకపోవడం వల్లనే కావచ్చు, మేము పెద్దవాళ్ళు చెప్పిన సిద్ధాంతాలు గుడ్డిగా నమ్ముతాం. అయితే ఏం! ఆనందంగానే వున్నాం." అన్న అమ్మమ్మ మాటలు మననం చేసుకుంటూ.. నన్ను బస్ ఎక్కించి కనుమరుగయిపోతున్న వీరయ్యనీ, వెనక్కి పరుగెడుతూన్న ఆ పల్లెటూరిని చూడలేక, కళ్ళు మూసుకుని సీట్‌లో వెనక్కి వాలాను.

*****

("ఆంధ్రప్రభ" సచిత్ర వారపత్రిక - 09 జూన్ 1993)